Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL/2024/86143

Associate Editor: K L KRISHNAM RAJU | Volume: 6 | Issue : 47 | Sunday 12.01.2025 | Price : Rs.3/- | Pages : 4

అసోసియేట్ ఎడిటర్ కే ఎల్ కృష్ణంరాజు | సంపుటి: 6 | సంచిక : 47 | ఆదివారం 12.01. 2025 | వెల : రూ.3/- | పేజీలు 4

WANTED

స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి. అనుభవం,అర్హతను బట్టి ప్రాధాన్యత ఇవ్వబడును

సంప్రదించండి సెల్ : 9440815774

## షెడ్యూల్ ప్రకారం పోలవరం ప్రాజెక్ట్‌ను... పూర్తి చేస్తాం : నిమ్మల



అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్** : పోలవరం ప్రాజెక్ట్ ను రాజీవ్ ప్రతాప్ రూఢీ నేతృత్వంలోని 30 మంది పార్లమెంటరీ కమిటీ సభ్యుల బృందం శనివారం సందర్శించింది. వారితో పాటు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కూడా ఉన్నారు. ఈ సందర్భంగా నిమ్మల మాట్లాడుతూ... పోలవరం ప్రాజెక్ట్ గురించి మాట్లాడే అర్హత వైసీపీకి లేదని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం పోలవరంను 20 ఏళ్లు వెనక్కి తీసుకెళ్లిందని విమర్శించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో 18 నెలలు కష్టపడి డయాఫ్రమ్ వాల్ ను నిర్మిస్తే దాన్ని మిగతా 2 లో

## తిరుమల పుష్కరిణిలో వైభవంగా... చక్రత్తాళ్వార్ స్నానం



తిరుమల, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్** : వైకుంఠ ద్వాదశి సందర్భంగా తిరుమలలో ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్తర ద్వారా దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. పదిరోజుల పాటు నిర్వహించనున్న ముక్కోటి ఏకాదశి ఉత్సవాల్లో భాగంగా శనివారం పుష్కరిణి తీర్థ ముక్కోటిలో చక్రస్నానం నిర్వహించారు. అనేక వేల తీర్థాలలో, స్వామి పుష్కరిణి అత్యంత పవిత్రమైనదని అర్చకులు తెలిపారు. శనివారం వేకువజామున సుదర్శన చక్రత్తాళ్వార్‌ను పవిత్ర పుష్కరిణి వద్దకు చిన జీయర్ స్వామి సన్నిధిలో వేద మంత్రాలతో తీసుకువచ్చి చక్రస్నానం నిర్వహించారు. అనంతరం చక్రత్తాళ్వార్ తిరిగి ఆలయానికి తీసుకెళ్లారు. ఈ మిగతా 2 లో

## ప్రయాణికులను వారి స్వస్థలాలకు చేర్చేందుకు అన్ని వనరులను...

# ఉపయోగించుకోవాలి

**సంక్రాంతి ప్రయాణికుల చేరవేతపై సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు**

**తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సందడి - సొంతూళ్లకు పయనమవుతున్న ప్రజలు**

**అవసరమైతే ప్రైవేటు విద్యాసంస్థల బస్సులను ఉపయోగించుకోవాలన్న సీఎం**

**ప్రయాణికుల రద్దీ ఉండే రూట్లలో ప్రైవేటు స్కూళ్లు, కాలేజీ బస్సులు తిప్పాలని సూచన**




అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్** : సంక్రాంతి శోభతో తెలుగు వారి లోగిళ్లలో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి. ఎక్కడెక్కడో ఉన్న తెలుగు వారు సంక్రాంతి వేడుకల కోసం స్వస్థలాలకు వస్తున్నారు. ముఖ్యంగా, పొరుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు ఏపీకి తరలివస్తున్నారు. ఈ నేపథ్యంలో, ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు కీలక ఆదేశాలు ఇచ్చారు. ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే రూట్లలో ఆర్టీసీ బస్సులు సరిపోకపోతే... ప్రైవేటు పాఠశాలలు, ప్రైవేటు కళాశాలలకు చెందిన బస్సులను కూడా ఉపయోగించుకోవాలని స్పష్టం చేశారు. ప్రయాణికులను వారి స్వస్థలాలకు చేర్చేందుకు అన్ని వనరులను ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రైవేటు విద్యా సంస్థలకు చెందిన బస్సుల సాయంతో ప్రయాణికులను ప్రధాన పట్టణాల నుంచి పల్లెలకు పంపించే ఏర్పాట్లు చేయాలని నిర్దేశించారు. అయితే, ఫిట్ నెస్ ఉన్న బస్సుల్లోనే ప్రయాణికులను పంపించాలని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ బస్సులన్నీ ఆర్టీసీ ద్వారా నడిపి ప్రజలకు ప్రయాణ కష్టాలు లేకుండా చూడాలని పేర్కొన్నారు. చంద్రబాబు ఇవాళ మిగతా 2 లో

## సంక్రాంతి కొత్త వెలుగులు...

# ఆనందం నింపాలి


**: ముఖ్యమంత్రి చంద్రబాబు**



అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్** : ఈ సంక్రాంతి ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగులు, ఆనందం నింపాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కోరుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం మీడియాతో ఇష్టాగోష్టి నిర్వహించారు. తెలుగు ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పండుగ సమయంలో ప్రతి ఒక్కరూ తమ ఊరు వెళ్లి నలుగురితో కలవటం అలవాటు చేసుకోవాలని అన్నారు. తాను అందుకే మా ఊరికి ప్రతీ సంక్రాంతికి వెళ్తున్నా అని చెప్పారు. సమాజంలో పై స్థాయిలో ఉన్నవారు దీనిని పాటిస్తే, మిగిలిన వారికి అది ప్రేరణగా ఉంటుందని అన్నారు. తాను మా ఊరు వెళ్లే సంప్రదాయానికి తన భార్య భువనేశ్వరినే కారణమని గుర్తుచేశారు. పాతికేళ్ల క్రితం ఆమె పట్టుబట్టి మొదలు పెట్టిన ఈ సంప్రదాయాన్ని క్రమ%శీ% తప్పకుండా పాటిస్తున్నామని చెప్పారు. మానవ సంబంధాలు తగ్గిపోతున్న ఈ రోజుల్లో ఒకచోట అంతా కలవటం, మాట్లాడుకోవడం మిగతా 2 లో

## తిరుపతి తొక్కిసలాట ఘటనలో బాబును...

# మొదటి ముద్దాయిగా చేర్చాలి



అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్** : తిరుపతి తొక్కిసలాట ఘటనలో ప్రభుత్వ వైఫల్యం చెందిందని , ఈ కేసులో సీఎం చంద్రబాబును మొదటి ముద్దాయిగా కేసు నమోదు చేయాలని వైసీపీ నాయకురాలు, మాజీ మంత్రి రోజా డిమాండ్ మిగతా 2 లో

## గ్రీన్ కో సోలార్ పవర్ కంపెనీతో...

# లక్షల మందికి ఉపాధి

**ఇంత భారీ ప్రాజెక్టు నిర్మిస్తున్నారంటే చాలా ఆనందంగా ఉంది: పవన్ కల్యాణ్**

**కర్నూలు జిల్లా ఓర్వకల్లులో గ్రీన్ కో సోలార్ పార్క్ - ప్రాజెక్టును సందర్శించిన పవన్ కల్యాణ్**

**తొలుత ఏరియల్ వ్యూ... తర్వాత రోడ్డు మార్గం ద్వారా పరిశీలన**

అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్** : ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేడు కర్నూలు జిల్లా ఓర్వకల్లులో పర్యటించారు. ఇక్కడి గ్రీన్ కో సోలార్ పార్క్ ను ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు. సోలార్ పార్క్, పంప్డ్ స్టోరేజి ప్రాజెక్టు సైట్ లను హెలికాప్టర్ ద్వారా పరిశీలించారు. ఏరియల్ వ్యూ అనంతరం రోడ్డు మార్గంలో ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మీడియాతో మాట్లాడుతూ, మొత్తం 2,800 ఎకరాల్లో ఈ ప్రాజెక్టు నిర్మిస్తున్నారని, ఇంత భారీ ప్రాజెక్టును మన రాష్ట్రంలో నిర్మిస్తున్నారంటే చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఇటువంటి మిగతా 2 లో



## మా కార్యకర్తల జోలికి వస్తే...

# తగిన గుణపాఠం చెబుతాం..

**కాంగ్రెస్ నాయకులకు కేటీఆర్ స్ట్రాంగ్ వార్నింగ్**

యాదాద్రి భువనగిరి జిల్లా : యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ గూండాల దాడిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ప్రతిపక్ష పార్టీల కార్యాలయాలపైన దాడులు చేయడం కాంగ్రెస్ పార్టీ అలవాటుగా మారిందని ఆయన విమర్శించారు. ఇందిర రాజ్యం పేరుతో అధికారంలోకి వచ్చి తెలంగాణలో గూండా రాజ్యం చలాయిస్తున్నారని మండిపడ్డారు. యాదాద్రి భువనగిరి జిల్లా పార్టీ అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక, కాంగ్రెస్ పార్టీ గూండాలను పంపి దాడులు చేయించడం అత్యంత హేయమైన చర్య అని కేటీఆర్ అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలపై, మిగతా 2 లో



## వైఎస్ అభిషేక్ రెడ్డి భౌతికకాయానికి....

# నివాళులు అర్పించిన జగన్

అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్** :: వైసీపీ అధినేత జగన్ బంధువు వైఎస్ అభిషేక్ రెడ్డి తీవ్ర అనారోగ్యంతో మరణించిన సంగతి తెలిసిందే. చికిత్స పొందుతూ హైదరాబాదులోని ఏఐజీ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. ఇవాళ పులివెందుల లో అంత్యక్రియల జరగనున్నాయి. ఈ ఉదయం పులివెందుల చేరుకున్న జగన్, వైఎస్ భారతి దంపతులు అభిషేక్ రెడ్డి భౌతికకాయానికి మిగతా 2 లో



# సంపాదకీయం

## మంచుకొండల్లో పొంచి ఉన్న ముప్పు

టిబెట్ భూభాగంతో ఉన్న టెక్టోనిక్ ప్లేట్లతో సంఘర్షిస్తున్నాయి. ఇప్పటికే, ఏడాదికి 2 మిల్లీ మీటర్ల చొప్పున భారత భూభాగం కూడా తగ్గుతున్నట్లు ఇటీవలి అధ్యయనాలు చెబుతున్నాయి. ఇది, రాబోయే కాలంలో మరింత భయానక భూకంపాలకు కారణమవుతుందా..?హిమాలయాలకు భూకంపం టెన్షన్ పట్టుకుంది. చల్లని వాతావరణాన్ని పంచే హిమాలయాల భూగర్భంలో తీవ్రమైన యుద్ధమే జరుగుతుంది. ఖండాలను చీల్చే టెక్టోనిక్ ప్లేట్ల మధ్య ఘర్షణతో.. హిమాలయన్ రీజన్ భయంకరమైన భూకంపాలకు కారణం అవుతోంది. అసలు, ఆ ప్రాంతంలో ఏం జరుగుతోంది..? టెక్టోనిక్ ప్లేట్ల సంఘర్షణతో వచ్చిన టెన్షన్ ఏంటీ..? రీసెంట్‌గా వచ్చిన టిబెట్ భూకంపానికి మించిన డేంజర్ భవిష్యత్తును భయపెడుతోందా..?విశ్వంలోనే అత్యంత అందమైన గ్రహం భూమి అంటారు. భూమిపైన వాతావరణం ఎంత అందంగా ఉంటుందోనని సంబరపడతారు. అయితే, భూమి లోపల ఏం జరుగుతుందో అందరికీ తెలియకపోవచ్చు. ఈ అందం కింద ఎంత విధ్వంసం దాగుందో అర్థం కాదు. ఇక, భారతదేశానికి తలమానికైన అద్భుత హిమాలయ ప్రాంతం కింద కూడా ఘోరమైన సంఘర్షణ జరగుతోందని ఎప్పటి నుండో అధ్యయనాలు చెబుతున్నాయి. హిమాలయన్ రీజన్‌లో రెండు భూ ఫలకాల మధ్య భారీ వత్తిడి పెరుగుతోంది. ఇది, భారత్, టిబెట్ దేశాల్లో దేనినైనా చీల్చడానికి అవకాశం ఉంది.ఈ ఏరియాలో రాబోయే తీవ్రమైన భూకంపాలతో ఒక ప్రాంతం సర్వనాశనమయ్యే ప్రమాదమూ ఉందనేది నిపుణుల అభిప్రాయం. ఇదే ఇప్పుడు భారత్‌ను కూడా భయపెడుతోంది. కొన్నేళ్లుగా హిమాలయన్ ప్రాంతంలో టెక్టోనిక్ ప్లేట్ల మధ్య మార్పులు కనిపిస్తున్నాయి. చాప కింద నీరులా.. ఈ ప్రాంత భూభాగం కింద టెక్టోనిక్ ప్లేట్లు జారిపోతూ ఉన్నాయి. టిబెట్, నేపాల్ సరిహద్దుల్లో భారీ భూకంపం సంభవించింది. జనవరి 7న సంభవించిన ఈ భయానక భూకంపంలో 126 మంది ప్రాణాలు కోల్పోగా.. 188 మంది గాయపడ్డారు. 400 వందల కంటే ఎక్కువ మంది భవన శిథిలాల కింద చిక్కుకున్నారు. ఇప్పటికీ ఇక్కడ సహాయక చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇది ఎంత తీవ్రంగా వచ్చిందంటే.. 24 గంటల్లో దాదాపు 20 సార్లు భూమి కంపించింది. రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 7.1గా నమోదైంది. జనవరి 8న సంభవించిన భూకంప తీవ్రంత 6.58గా నమోదయ్యింది.వరుసగా వచ్చిన ప్రకంపనల్లో 10 సార్లు 6 తీవ్రతతో భూకంపం ఏర్పడింది. భూకంపాలకు ప్రసిద్ధి చెందిన టిబెట్ ప్రాంతంలో గత సంవత్సరం 100 భూకంప సంఘటనలు జరగ్గా అవి కనీసం 3.0 తీవ్రతతో వచ్చినట్లు డేటా వెల్లడిస్తోంది. అయితే, 7 తీవ్రతకు మించిన చాలా తక్కువే అయినప్పటికీ.. 20వ శతాబ్దం ప్రారంభం నుండి ఇప్పటి వరకూ 7 తీవ్రత దాటిన భూకంప సంఘటనలు 9 సార్లు వచ్చినట్లు తెలుస్తోంది. ఇక, ఇప్పుడొచ్చిన భూకంప తీవ్రతకు వెయ్యి కంటే ఎక్కువ ఇళ్లు దెబ్బతిన్నాయి. ఈ ప్రాంతంలో భారీ జనసాంద్రత ఉండటం వల్ల వందల మంది నిరాశ్రయులుగా మారాల్సి వచ్చింది.ఈ భూకంప ప్రభావం ఒక్క టిబెట్‌ను మాత్రమే కాకుండా నేపాల్, భారత్‌లలో కూడా కనిపించింది. టిబెట్‌లోని డింగ్రీ కౌంటీ చుట్టుపక్కల ప్రాంతాల్లో భూకంప తీవ్రత అధికంగా ఉంది. ఈ భూకంపం ధాటికి భవనాలు నేలమట్టం అయ్యాయి. టిబెట్ సరిహద్దుని ఆనుకుని ఉన్న నేపాల్‌లోని 7 జిల్లాల్లో భూకంపం ప్రభావం కనిపించింది. నేపాల్-టిబెట్ సరిహద్దుకు 93 కిలోమీటర్ల దూరంలోని లబుచె ప్రాంతంలో ఉదయం 6.30 గంటలకు ఈ భూకంపం సంభవించింది. టిబెట్‌లోని షిజాంగ్‌లో 10 కి.మీ లోతున భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మొత్తం ఆరుసార్లు భూకంపం వచ్చినట్టు చెప్పారు., టిబెట్‌లో విధ్వంసం సృష్టించిన ఈ భూకంప కేంద్రం.. నేపాల్-భూటాన్ సరిహద్దు వైపు ఉన్న ఎవరెస్టు శిఖరానికి కేవలం 80 కిలోమీటర్ల దూరంలోనే ఉంది. భూకంపానికి కారణమైన కేంద్ర భాగం.. భూ ఉపరితలం నుంచి 10 కి. మీ. లోతులో ఉన్నట్లు భూకంప పరిశీలకులు వెల్లడించారు. ఈ ప్రాంతాన్ని లాసా రీజియన్ అని పిలుస్తున్నారు. ఇది హిమాలయన్ ప్రాంతంలో భౌగోళికంగా అత్యంత కీలకమైన ప్రదేశంగా ఉంది. ఈ ప్రాంతానికి ఉత్తరం వైపు.. బ్యాంగాంగ్- నుజి యాంగ్ జోన్ ఉండగా.. దక్షిణం వైపు ఇండస్- యార్లింగ్ జాంగ్బో సరిహద్దులు ఉంటాయి.ఇక్కడ భూ ఫలకాల్లో మార్పులు సంభవించినప్పుడల్లా దాని ప్రభావం ఈ ప్రాంతంపై పడుతుంది. అందుకే తరచూ ఇక్కడ భూకంపాలు ఏర్పడుతుంటాయి. గత రికార్డులు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేసాయి. ఇండియన్, యురేషియన్ టెక్టోనిక్ ప్లేట్ల మధ్య నిత్యం జరుగుతున్న ఘర్షణలు ఈ భూకంపాలకు కారణం అవుతున్నాయి. అయితే, భవిష్యత్‌లో మరింత ప్రమాదకరమైన భూకంపాలు వచ్చే అవకాశమున్నట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు.పురాతన ఖండం గోండ్వానాలో ఒక భాగంగా ఉన్న భారత భూభాగం.. 10 కోట్ల సంవత్సరాల క్రితం ఇతర శకలాల నుంచి భారత టెక్టోనిక్ ప్లేట్‌గా విడిపోయింది. ఇది ఉత్తరం వైపు కదులుతూ వచ్చింది. ప్రస్తుతం, భారత ఉపఖండం, దక్షిణ చైనా, పశ్చిమ ఇండోనేషియాలో కొంత భాగం వరకు ఈ ప్లేట్ విస్తరించి ఉంది. ఇది 5 కోట్ల సంవత్సరాల నుంచి యురేషియన్ ప్లేట్‌ను ఢీ కొడుతూ ఉంది. దాని ప్రభావంతోనే హిమాలయ శ్రేణులు ఏర్పడ్డాయి. ప్రస్తుతం, ఈ టెక్టోనిక్ ప్లేట్.. యురేషియన్ ప్లేట్ వైపు ఏటా 5 సెంటీమీటర్ల మేర కదులుతూ.. దాన్ని ఢీకొంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.గతంలో కూడా హిమాలయాల మధ్య భాగాలైన నేపాల్‌లోని ఖాట్మండు, భారతదేశంలోని డెహ్రా డూన్ మధ్య గతంలో పెద్ద భూకంపం సంభవించిందనీ.. భవిష్యత్తులో అలాంటి మరో భూకంపం వస్తుందని శాస్త్రవేత్తలు అనుమానిస్తున్నారు. అందులోనూ, భారతీయ టెక్టోనిక్ ప్లేట్ హిమాలయాల క్రింద సంవత్సరానికి 1.8 సెంటీమీటర్ల మేర ఒక పెద్ద లోపంతో కదులుతున్నట్లు తెలుస్తోంది. ఇది ఆసియా వైపు భారతదేశ మొత్తం ప్లేట్ కదలికలో మూడింట ఒక వంతు. అంటే, సంవత్సరానికి 5.4 సెంటీమీటర్లు. ఇక, మిగిలిన ప్లేట్ కదలిక రేటు టిబెట్, మధ్య ఆసియాలోని ఇతర ప్రాంతాల్లో ఉంది. అయితే, ఈ టెక్టోనిక్ ప్లేట్ల కదలిక ప్రభావంతో భవిష్యత్తులో హిమాలయ ప్రాంతాలైన హిమాచల్ ప్రదేశ్, నేపాల్ వంటి పలు ప్రాంతాల్లో కూడా తీవ్రమైన భూకంప ప్రభావం ఏర్పడుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ ప్రభావం భారత ఈశాన్య రాష్ట్రాలతో పాటు ఉత్తర భారతదేశంపై తీవ్రమైన ప్రభావం చూపుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. టెక్టోనిక్ ప్లేట్ల నిరంతరం వస్తున్న ఈ మార్పులు? టిబెట్‌తో పాటు భారత భూభాగాన్ని కూడా విడదీస్తూ చివరికి భూమి మధ్యలో ఉన్న మెన్టెల్‌లో కలిపేస్తాయనే సిద్ధాంతం కూడా గట్టిగానే వినిపిస్తుంది.హిమాలయ ప్రాంతంలో భౌగోళిక రాజకీయ పరిస్థితులు ఎలా ఉన్నప్పటికీ.. భూమి కింద ఉన్న టెక్టోనిక్ ప్లేట్లు మాత్రం తమ పని తాము చేసుకుపోతున్నాయి. ఏ ఖండాన్ని ఎటు చీల్చుతాయో తెలియకుండా కలవరం పుట్టిస్తున్నాయి. దేని కోసం మనుషులు ఘర్షణ పడుతున్నారో.. అది శాశ్వతం కాదని చెప్పకనే చెబుతున్నాయి.

## ప్రయాణికులను వారి స్వస్థలాలకు చేర్చేందుకు....

మంగళగిరిలోని టీడీపీ ప్రధాన కార్యాలయంలో మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చిన సూచన పట్ల ఆయన వెంటనే స్పందించి పైవిధంగా ఆదేశాలు జారీ చేశారు.

**చంద్రబాబు చిట్ చాట్ లో ముఖ్యాంశాలు... :**

- రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు... ఈసారి మరింత ఎక్కువ పండుగ సందడి కనిపిస్తోంది.
- పొరుగు రాష్ట్రాల నుంచి సొంత గ్రామాలకు వెళ్లే ప్రయాణికులకు రాష్ట్ర పరిధిలో అదనపు రవాణా సౌకర్యాలు తీసుకువస్తున్నాం.
- రోడ్ల మరమ్మతుల విషయంలో చాలా వరకు మార్పు తేగలిగాం.
- వచ్చే నెలాఖరు నాటికి గుంతలు లేని రహదారుల పనులు పూర్తి చేస్తాం.
- దశల వారీగా అన్ని రహదారుల పనులు పూర్తి చేస్తాం... ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణం కల్పిస్తాం.
- రాష్ట్రంలో పెట్టుబడుల రాక ఉత్సాహాన్నిస్తోంది. గ్రీన్ ఎనర్జీలో రూ.1.85 లక్షల కోట్ల పెట్టుబడులు గొప్ప ముందడుగు. ఒక్క క్లీన్ ఎనర్జీలోనే రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయి.
- రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడంపై రాష్ట్రాన్ని మార్కెట్ చేసేందుకు దావోస్ పర్యటన ఉపయోగపడుతుంది.
- ప్రపంచ స్థాయి సంస్థలతో నెట్‌వర్క్ అవడం ద్వారా మన దగ్గర ఉన్న అవకాశాలను అందరికీ తెలిసేలా చేయవచ్చు... తద్వారా పెట్టుబడులకు అవకాశం.
- గ్రీన్ ఎనర్జీ, బయో ఫ్యూయల్స్ రంగంలో ఉన్న అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకుంటున్నాం.
- రానున్న రోజుల్లో రాష్ట్రంలో 5 వేల ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తాం.
- రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేస్తున్న బయో కంప్రెస్డ్ గ్యాస్ ద్వారా రైతులకు ఎకరానికి రూ.30 వేలు కౌలు లభిస్తుంది. తరువాత ఆ వ్యర్థాలు ఎరువులగానూ ఉపయోగపడుతాయి.
- కుప్పంలో ప్రతి ఇంటికీ పీఎం సూర్యఘర్ కార్యక్రమం చేపట్టాం. రాష్ట్రమంతటా దీన్ని విస్తరిస్తాం. ఎస్సీ, ఎస్టీలకు పూర్తి సబ్సిడీతో సూర్యఘర్ కార్యక్రమం చేపడతాం.
- ఇతర వర్గాల ప్రజలకు ప్రభుత్వ పెట్టుబడితోనే పథకం అమలుకు ఆలోచన చేస్తున్నాం. పెట్టుబడి తిరిగి వచ్చే వరకు ఆ విద్యుత్‌లో కొంత భాగాన్ని ప్రభుత్వం తీసుకుంటుంది.
- రెండు కిలోవాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తికి రూ.1.15 లక్షలు ఖర్చవుతుంది. ఇందులో కేంద్ర సబ్సిడీ పోగా మిగిలింది లబ్ధిదారులు భరించాలి.
- సోలార్‌తో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను కొంత కాలం ప్రభుత్వానికి ఇవ్వడం ద్వారా 100 శాతం సబ్సిడీ వచ్చేలా ప్రణాళిక రచిస్తున్నాం.
- సోలార్ విద్యుత్‌తో ప్రతి ఒక్కరి ఇంట్లో ఆదాయం పొందే పైలట్ ప్రాజెక్టును ఇటీవల కుప్పంలో ప్రారంభించాం.
- ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీ స్వాపింగ్ విధానం ద్వారా ప్రతి ఒక్కరూ ఆదాయం పొందవచ్చు. ఇది సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ అవుతుంది. కుప్పంలో దీన్ని పైలట్‌గా చేపడుతున్నాం.
- గ్రామ, వార్డు సచివాలయాలను మరింత సమర్థవంతంగా ఉపయోగించుకుంటాం. మిగులు ఉద్యోగులను సంబంధిత శాఖలకు ఎంపుతాం
- ప్రజలకు సంబంధించిన డేటా ద్వారా వారికి నేరుగా సంక్షేమ కార్యక్రమాలు, జీవన ప్రమాణాలు పెంచే కార్యక్రమాలు చేపడతాం.
- ప్రతి ఇంటినీ జియోట్యాగ్ చేసి... ప్రతి వ్యక్తి, ప్రతి ఇల్లు యూనిట్‌గా కార్యక్రమాలు చేపడతాం.
- డ్రోన్, ఏఐ, ఐఓటి, సీసీ కెమారాలు, అధార్ వంటి వాటి ద్వారా ప్రభుత్వ సేవల్లో, ప్రజల జీవితాల్లో మార్పులు తెస్తాం.
- ప్రజల సమాచారాన్ని రియల్‌టైంలో మానిటరింగ్, అనాలసిస్ చేయడం ద్వారా పాలన మెరుగు అవుతుంది.
- వెల్తీ, హెల్తీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్ మా విధానం.
- గతంలో చేపట్టిన హ్యాపీ సండే వంటి కార్యక్రమాలు మళ్లీ నిర్వహిస్తాం. హ్యాపీ సండే, కమ్యూనిటీ ఫ్రెండ్ షిప్ వంటి కార్యక్రమాలతో ప్రజల మధ్య అనుబంధాలు, స్నేహాలు పెంచుతాం.
- సెల్ ఫోన్లకు ప్రజలు బానిసల్లా మారిపోతున్నారు. లైఫ్ మరీ మెకానికల్‌గా అయిపోతుంది.
- మనం ఆనందంగా ఉండడంతో పాటు పక్కవాళ్లు కూడా ఆనందంగా ఉండాలి అందులో భాగమే పీ4.
- పీ4 విధానంపై కాన్సెప్ట్ పేపర్‌ను విడుదల చేస్తాం. ఉన్నతస్థానాల్లో ఉన్న వాళ్లు అట్టడుగున ఉన్న వాళ్లకు చేయూతనిచ్చే కార్యక్రమాన్ని ప్రారంభిస్తాం.

## మా కార్యకర్తల జోలికి వస్తే...

నాయకులపై, పార్టీ కార్యాలయాలపై దాడులు చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. పదేళ్లపాటు ప్రశాంతంగా కొనసాగిన తెలంగాణ రాష్ట్రం, ఈరోజు అరాచకాలకు చిరునామాగా మారిందని విమర్శించారు. దాడులు, గూండాగిరి తమ మార్కు పాలన అని కాంగ్రెస్ పార్టీ మరోసారి నిరూపించుకుంటుందని అన్నారు.. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల జోలికి, కార్యాలయాల జోలికి వస్తే తగిన గుణపాఠం చెబుతామని కేటీఆర్ హెచ్చరించారు. వెంటనే బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై దాడి చేసిన కాంగ్రెస్ గూండాలతో పాటు, వారి వెనుక ఉన్న నలగొండ జిల్లా కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

**పదేళ్లు మేం ఇలాగే చేస్తే పరిస్థితులు ఇట్లా ఉండేవా? : హరీశ్‌రావు**

బీఆర్ఎస్ నాయకులు హరీశ్‌రావు కూడా యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో విమర్శలు, ప్రతివిమర్శలు సహజమని హరీశ్‌రావు తెలిపారు. కానీ కాంగ్రెస్ వచ్చాక దాడుల విష సంస్కృతిని ప్రోత్సహిస్తున్నదని విమర్శించారు. యథా రాజ తథా ప్రజా అన్నట్లుగా కాంగ్రెస్ పార్టీ తీరు ఉందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలతో దాడులు చేస్తే, ఆ పార్టీకి చెందిన నాయకులు భౌతిక దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఇదేనా మీ సోకాల్డ్ ఇందిరమ్మ రాజ్యం? ఇదేనా మీ సోకాల్డ్ ప్రజా పాలన అని ప్రశ్నించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఇలాగే దాడులు జరిగి ఉంటే మీకు అడ్డగోలుగా మాట్లాడే పరిస్థితులు ఉండేవా అని కాంగ్రెస్ నాయకులపై హరీశ్‌రావు మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీపైన గోబెల్స్ ప్రచారం చేసే అవకాశం ఉండేదా అని నిలదీశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రశాంతంగా ఉన్న తెలంగాణలో, ఏడాది కాంగ్రెస్ పాలనలో అశాంతి, అలజడి నెలకొన్నదని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై దాడి చేసిన వారిని గుర్తించి, తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులు పునరావృతమైతే చూస్తూ ఊరుకునేది లేదని.. తగిన రీతిలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

## ప్రభుత్వ భూమి కలిసింది...

# సరెండర్ చేస్తున్న సిరిసిల్ల జనాలు

కరీంనగర్, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** : ఎక్కడైనా ఈ భూములు మాకొద్దు అంటూ కలెక్టర్ ను కలిసి వాపస్ చేసిన సీన్లు చూశారా?ఇప్పుడు చూపిస్తాం చూడండి..సుంచుల కుమారస్వామి. బీఆర్ఎస్ లోకల్ లీడర్. సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం సారంపల్లి పరిధిలోని సర్వే నంబర్ 464లోని 3 ఎకరాల ప్రభుత్వ భూమి ఈయన సొంతమైంది. సీన్ కట్ చేస్తే ఇప్పుడు సిరిసిల్ల జిల్లాలో ఇలా కబ్జాలు చేసిన వారంతా అరెస్టై జైలుకు వెళ్లారు. దీంతో కేసుల భయం ఎందుకని చెప్పి ఇదిగో ఇలా జిల్లా కలెక్టర్, ఎస్పీని కలిసి ఈ భూమి నాకొద్దు మహా ప్రభో అని సరెండర్ చేస్తున్నట్లు ప్రకటించారు. చాలా మంది చేసుకున్నట్లే నేను చేసుకున్నా.. ఇప్పుడు వద్దని ఇచ్చేస్తున్నా.. ఇదీ డైలాగ్.ఇదొక్క ఎగ్జాంపులే కాదు.. ఈ నెల 2న తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్ మాజీ సర్పంచ్ మిట్టపల్లి పద్మ కూడా 2 ఎకరాల భూమిని కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు సరెండర్ చేశారు. కేసులు నమోదవుతుండడంతో కబ్జా, అక్రమ పట్టాదారుల్లో భయాలు మొదలయ్యాయి. దీంతో ఎందుకొచ్చిన తంటా అని చెప్పి భూముల్ని వాపస్ చేస్తున్నారు. అదీ మ్యాటర్. ఒకవైపు సిరిసిల్లలో అసైన్డ్ ల్యాండ్స్ ను కబ్జాలు చేసి ధరణి వచ్చాక తమపేర్లపై మార్చుకుని గులాబీ లీడర్లు చేసిన దందాలు బయటికొస్తున్నాయి. చెరువు, అటవీ, అసైన్డ్ ఇలా దేన్నీ వదల్లేదు. ధరణి వచ్చాక ఇంకింత రెచ్చిపోయారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన జీవోలను ఆసరాగా చేసుకుని చక్రం తిప్పుకున్నారు. ఇప్పుడు కటకటాలు లెక్కపెడుతున్నారు. నాడు కేటీఆర్ మంత్రిగా ఉండడంతో అధికారులు కూడా చూస్తూ ఉండిపోయారు. ఏమీ చేయలేకపోయారు. కానీ ఇప్పుడు ప్రభుత్వం మారింది. కథ మారింది. అందుకే అక్రమాలన్నీ ఒక్కొక్కటిగా తెరపైకి వస్తున్నాయి. సిరిసిల్ల లాండ్ ఫైల్స్ ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.ఇక్కడ అన్నిటికంటే హైలెట్ ఏంటంటే.. కొట్టేసిన భూముల్ని వరుసగా ప్రభుత్వానికి సరెండర్ చేసేందుకు ముందుకొస్తున్నారు. అంటే అక్కడ ఏం జరిగిందో ఎవరికైనా ఇట్టే అర్థమవుతుంది. సిరిసిల్ల జిల్లాలో అసైన్డ్, ప్రభుత్వ భూములను అక్రమంగా పట్టా చేసుకున్న బీఆర్ఎస్ లీడర్ల అరెస్ట్ లు కంటిన్యూ అవుతున్నాయి. బీఆర్ఎస్ సీనియర్ లీడర్ బొల్లి రామ్మోహన్, అగ్గి రాములు, జిందం దేవదాస్, సురభి నవీన్ రావుపై పోలీసులు కేసు నమోదు చేసి జైలుకు పంపారు ఈనెల 7న తంగళ్లపల్లి మండలం నేరేళ్ల బీఆర్ఎస్ నేత పూడూరి భాస్కర్ ను రిమాండ్ కు తరలించారు. భాస్కర్ మండేపల్లిలో 20 గుంటల అసైన్డ్ భూమిని అక్రమంగా పట్టా చేసుకున్నారని రెవెన్యూ అధికారులు తేల్చడంతో కటకటాలు లెక్కిస్తున్న పరిస్థితి. అంతే కాదు తంగళ్లపల్లి మండలానికి చెందిన మరో నలుగురు లీడర్లు పరారీలో ఉన్నారని కూడా చెబుతున్నారు.తంగళ్ళపల్లి మండలం తాడూరులోని సర్వే నంబర్ 1148లో సురభి నవీన్ రావు 3 ఎకరాలు, సురభి దేవేందర్ రావు పేరిట 3 ఎకరాలు మొత్తం 11 ఎకరాలు కబ్జా అయ్యాయని నిర్ధారించారు. కేసు నమోదు చేసి రిమాండ్ కి తరలించారు. 11 ఎకరాలను తిరిగి ప్రభుత్వ భూమిగా రికార్డుల్లో మార్చారు కలెక్టర్. ఇక బొల్లి రామ్మోహన్ ఈయన సిరిసిల్ల జిల్లాలో సీనియర్ బీఆర్ఎస్ లీడర్. సర్దాపూర్, బద్దేపల్లిలో ఏడు ఎకరాలను మాయ చేసి పట్టా పొందారు. దీంతో ఆయన్ను పోలీసులు అరెస్ట్ చేశారు.ధరణి వచ్చే టైంలో నాటి బీఆర్ఎస్ సర్కార్ ఓ ఉత్తర్వు ఇచ్చింది. దాని ప్రకారం 2017 డిసెంబర్ 31 కంటే ముందు ఎవరైనా భూమిలేని పేదవారు అసైన్డ్ భూమి కొనుగోలు చేస్తే, వారిని ఆ భూమి నుంచి తొలగించకుండా వారికే అసైన్మెంట్ పట్టా జారీ చేయొచ్చని భూ రికార్డుల ప్రక్షాళన సమయంలో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కానీ అదే మంచి సమయం అనుకున్న చాలా మంది బీఆర్ఎస్ లీడర్లు.. అసైన్డ్ భూములను చాలా తక్కువ ధరకు పేదల నుంచి రాయించుకుని.. పాస్ బుక్స్ పొందారు. ఇదే జీవోను అడ్డం పెట్టుకుని సిరిసిల్ల జిల్లా బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి తమ్ముడు జిందం దేవదాసు లాండ్ పొందారు.తంగళ్లపల్లి మండలం సారంపెల్లి శివారులోని 164/3లో 3 ఎకరాలు కొన్నాడు. ప్రభుత్వ రూల్స్ ప్రకారం.. అసైన్డ్ ల్యాండ్ కొనాలంటే ఆ వ్యక్తి స్థానికుడై ఉండాలి. భూమి లేని పేద రైతు అయి ఉండాలి. అదే భూమిపై ఆధారపడితేనే రీఅసైన్ చేయాలి. కానీ జిందం దేవదాసు ఐటీ రిటర్న్స్ ఫైల్ చేస్తున్న బడా కాంట్రాక్టర్. అప్పట్లోనే అతడికి నోటీసులు ఇచ్చి కేసు నమోదు చేయాల్సి ఉన్నప్పటికీ అప్పటి తహసీల్దార్ పట్టించుకోకుండా పాస్‌బుక్ జారీ చేశారు. ఎందుకంటే నాటి ప్రభుత్వంలో బలమైన లీడర్లుగా చెలామణి అవడమే. అంతే కాదు నాడు మంత్రిగా ఉన్న కేటీఆర్ సొంత నియోజకవర్గం సిరిసిల్లకు వచ్చినప్పుడల్లా వెంట ఉండే వారు కావడంతో అధికారులు కూడా ఏమీ చేయలేకపోయారు.ప్రభుత్వ భూములను పట్టా చేయించుకున్న వారిలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రధాన అనుచరుడు, సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పేరు కూడా ఉంది. ఆయన భార్య పేరిట ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపురంలోని 119/4 సర్వే నంబర్ లో 3.20 ఎకరాల భూమికి లావుణీ పట్టా జారీ అయింది. వెంకటాపురంలో సర్కార్ భూమిని అసైన్డ్ చేయడానికి అర్హులైన పేదలు, కూలీలు ఎంతో మంది ఉన్నా.. ఎల్లారెడ్డిపేటలో ఉండే బీఆర్ఎస్ లీడర్, ఆర్థికంగా బలంగా ఉన్న ఆగయ్య కుటుంబానికి లావుణీ పట్టా మంజూరు చేయడం వివాదాస్పదంగా మారింది. ఈ విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో గత నెలలో ఈ భూమిని ప్రభుత్వ భూమిగా ధరణి రికార్డుల్లో మార్చేశారు. అదీ మ్యాటర్. సో ఇవన్నీ దొరికినవే. ఇంకా దొరకనివి, దొరకాల్సినవి ఎన్నో ఉన్నాయి.సిరిసిల్ల జిల్లాలో జరిగిన భూ భాగోతాలపై కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఎంక్వైరీ చేస్తుండడం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. ఇదే జిల్లాలో దాదాపు 300 నుంచి 500 ఎకరాల అసైన్డ్ భూములను అక్రమంగా పట్టాలు చేయించుకున్నారంటున్నారు. ఇంకా తవ్వి తీస్తే మొత్తం 2 వేల ఎకరాల దాకా బయటపడుతుందంటున్నారు. ఇప్పటికే సిరిసిల్ల జిల్లా పెద్దూర్, సర్దాపూర్, తంగళ్లపల్లి మండలం గోపాల్‌రావుపల్లె, అంకుషాపూర్, తాడూర్, లక్ష్మీపూర్, పాపయ్యపల్లె, ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామాల్లో భూముల హాంఫట్ కథలు బయటికొచ్చాయి.ఇదే మ్యాటర్ పై రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కూడా రియాక్ట్ అయ్యారు. సిరిసిల్ల జిల్లాలో పేదల పేరుతో బీఆర్ఎస్ లీడర్లు 2 వేల ఎకరాల ప్రభుత్వ భూములు కబ్జా చేశారన్నారు. ఈ భూములను ఉద్దేశపూర్వకంగానే వందల మంది పేర్లపై అసైన్డ్ భూమిగా నమోదు చేశారని చెప్పారు. సీసీఎల్ఏ ఆఫీస్ నుంచి ప్రత్యేక టీములను సిరిసిల్ల లాండ్ స్కామ్స్ పై ఎంక్వైరీకి పంపిస్తున్నారు.సిద్దిపేటలో దళితులు, పేదలు ఉన్న 484 ఎకరాల ప్రభుత్వ భూమిని గత ప్రభుత్వం ప్రైవేటు పరం చేస్తే కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నిషేధిత జాబితాలో చేర్పించిందన్నారు మంత్రి పొంగులేటి. 2014 నుంచి 2023 వరకు రాష్ట్రంలో జరిగిన భూ అక్రమాలు, లావాదేవీలపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించి సర్కారు భూములు స్వాధీనం చేసుకుంటామని మరోసారి క్లారిటీ ఇచ్చారు. ఇందుకోసం మహారాష్ట్ర, తెలంగాణకు చెందిన సంస్థల్ని ఎంపిక చేయబోతున్నారు.

## తిరుపతి తొక్కిసలాట ఘటనలో...



చేశారు. శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. ఘటన జరిగి మూడు రోజులు కావస్తున్నా ఇంతవరకు ఒక్క కేసు నమోదు కాలేదని ఆరోపించారు. టీటీడీ చైర్మన్, ఈవో, ఏఈవో, ఎస్పీతో పాటు బాధ్యులైన వారందరిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో నిందితులపై చర్యలు తీసుకోకపోగా అధికారులను కాపాడాలనే చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతి తొక్కిసలాటలో ఆరుగురు మృతి చెందడంతో హిందూవుల మనోభావాలు సీఎం, డిప్యూటీ సీఎంకు ఇంకా తెలియరావడం లేదని అన్నారు. సంధ్యా థియేటర్ ఘటనలో ఒకరు చనిపోతే అల్లు అర్జున్‌కు మానవత్వం లేదని పవన్ కల్యాణ్ అన్నారని, గేమ్ ఛేంజర్ ఈవెంట్‌కు వెళ్లి ఇద్దరు చనిపోతే ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. తిరుమలలో ఇలాంటి ఘోరమైన దుర్ఘటనలు ఎప్పుడు జరుగలేదని అన్నారు .చంద్రబాబు ఏ ముహూర్తాన ముఖ్యమంత్రి అయ్యారో టీటీడీ పరువు, ప్రతిష్ట దిగజారే విధంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. తనకు సంబంధించిన మనుషులను టీటీడీలో పెటుకున్నారని, వారిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. సెక్యూరిటీ ఆఫీసర్‌గా పనిచేసిన సుబ్బారాయుడిని తిరుపతి ఎస్పీగా పెట్టుకున్నారని విమర్శించారు. అంతకు ముందు ఆమె తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్నారు.

## గ్రీన్ కో సోలార్ పవర్ కంపెనీతో...

సమీకృత ప్రాజెక్టు దేశంలో మరెక్కడా లేదని వెల్లడించారు. సోలార్ పవర్ రంగంలో గ్రీన్ కో కంపెనీకి అంతర్జాతీయస్థాయిలో మంచి పేరుందని తెలిపారు. గ్రీన్ కో మన దేశంలో లక్షన్నర కోట్ల రూపాయల పెట్టుబడి పెడుతోందని, అందులో భాగంగా మన రాష్ట్రంలో రూ.35 వేల కోట్ల పెట్టుబడి పెడుతోందని వివరించారు. గ్రీన్ కో సోలార్ పవర్ కంపెనీ ద్వారా లక్షల మందికి ఉపాధి లభిస్తుందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. కాగా, ఈ ప్రాజెక్టు భూమి విషయంలో రెవెన్యూ, అటవీశాఖ మధ్య చిన్న వివాదం ఏర్పడిందని తెలిపారు. ఈ వివాదాన్ని సామరస్య పూర్వకంగా పరిష్కరించాలని కేంద్రాన్ని కోరామని వెల్లడించారు. భవిష్యత్తులో గ్రీన్ కో సోలార్ పార్క్ ప్రాజెక్టు పర్యాటక కేంద్రం కానుందని పవన్ వ్యాఖ్యానించారు. ఈ ప్రాజెక్టుకు కేంద్రం కూడా తగిన సహకారం అందించాలని ఆశిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే రూ.12 వేల కోట్ల పెట్టుబడులు పెట్టిందని, ఈ ప్రాజెక్టు వల్ల జిల్లాకు, రాష్ట్రానికే కాదు... దేశానికి కూడా మంచి పేరొస్తుందని తెలిపారు. ఇక, సీఎస్ఆర్ నిధుల ద్వారా సంస్థ పలు సామాజిక కార్యక్రమాలు చేపట్టాలని కోరుతున్నానని అన్నారు. పాఠశాలలు, సేంద్రియ సాగు, గోవుల సంతతి పెంచేందుకు పాటుపడాలని పిలుపునిచ్చారు.

## సంక్రాంతి కొత్త వెలుగులు...

ఎంతో అవసరమని తెలిపారు. మనం ఆనందంగా పండుగ చేసుకునేటప్పుడు.. ఆ ఊరిలో పేదవారు కూడా ఆనందంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. పేదవాడికి చేయూతనిచ్చి నిలబెట్టాల్సిన బాధ్యత మిగిలినవారిపై ఉందని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ విధానం ప్రోత్సహించటానికే పీ4 కాన్సెప్ట్ పేపర్‌ను రేపు(ఆదివారం) విడుదల చేస్తామని అన్నారు. దీనిపై అన్నిస్థాయిల్లో చర్చ జరిగాక అమల్లోకి తెస్తామన్నారు. పీ4 విధానం బాగా చేసిన వారికి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో అవార్డులు ఇచ్చి ప్రోత్సహిస్తామని తెలిపారు. ఎప్పుడూ లేని విధంగా ఈసారి సంక్రాంతి రద్దీ ఎక్కువగా ఉందని అన్నారు. సొంతూళ్లకు వెళ్లేందుకు ప్రజలు పెద్దఎత్తున తరలివస్తున్నారని చెప్పారు. రద్దీ నియంత్రించటానికి కలెక్టర్లతో మాట్లాడతానని అన్నారు. ముఖ్య నగరాలకు చేరుకున్న వారిని వారి స్వగ్రామాలకు చేరుకునేందుకు కళాశాలలు, పాఠశాలల బస్సులు ఏర్పాటు చేసే సూచనను పరిశీలిస్తామని తెలిపారు. గత సంక్రాతితో పోల్చితే చాలా వరకూ రహదారులను మెరుగుపరిచామన్నారు. వచ్చే నెలాఖరుకు మిగిలిన రహదారులు బాగుచేస్తామని చెప్పారు. ప్రజల మధ్య సత్సంబంధాలు పెంచేందుకు పండుగలు ఓ వారధిగా ఉంటాయని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ పరంగానూ హ్యాపీ స%శీ%డే లాంటి కార్యక్రమాలు ఈ సారి గ్రామస్థాయిల్లోనూ ప్రోత్సహిస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## వైఎస్ అభిషేక్ రెడ్డి భౌతికకాయానికి....

నివాళులు అర్పించారు. అభిషేక్ రెడ్డి కుటుంబ సభ్యులను జగన్ ఓదార్చారు. వైఎస్ అభిషేక్ రెడ్డి... జగన్ కు సోదరుడి వరుస అవుతారు. అభిషేక్ రెడ్డి వైసీపీ వైద్య విభాగానికి రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నారు. ఆయన విశాఖలో వైద్య విద్యను అభ్యసించారు. పులివెందుల నియోజకవర్గంలో వైసీపీ కార్యకలాపాలను అభిషేక్ రెడ్డి సమన్వయం చేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో పులివెందుల నియోజకవర్గంలో క్రియాశీలకంగా వ్యవహరించారు.

## షెడ్యూల్ ప్రకారం...

వైసీపీ ప్రభుత్వం ధ్వంసం చేసిందని నిమ్మల మండిపడ్డారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం ఈ నెలలో డయాఫ్రమ్ వాల్ కాంక్రీట్ పనులు మొదలుపెడతామని... 2027 సెప్టెంబర్ కల్లా ప్రాజెక్ట్ ను పూర్తి చేస్తామని తెలిపారు. 2017లో పోలవరం నిర్వాసితులకు చంద్రబాబు రూ. 800 కోట్ల పరిహారాన్ని అందించారని... ఇప్పుడు మరో రూ. 800 కోట్లకు పైగా నిధులను అందించారని చెప్పారు. వైసీపీ హయాంలో నిర్వాసితుల కాలనీల నిర్మాణం జరగలేదని... బిల్లుల చెల్లింపులు జరగలేదని దుయ్యబట్టారు.


## తిరుమల పుష్కరిణిలో ....

కార్యక్రమంలో టీటీడీ ఈవో శ్యామలరావు, బోర్డు సభ్యురాలు పనబాక లక్ష్మి, డీఈవో లోకనాథం, పేష్కార్ శ్రీరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. నిన్న స్వామివారిని 60,094 మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా 14,906 మంది తలనీలాలు సమర్పించుకున్నారని ఆలయ అధికారులు వివరించారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 2.45 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు.

**ఎస్వీ వేద పరిరక్షణ ట్రస్ట్‌కు విరాళం :**

హైదరాబాద్‌లోని సాయి రాఘవేంద్ర కన్‌స్ట్రక్షన్స్ చీఫ్ ఎం జనార్దన్ అనే భక్తుడు శ్రీ వెంకటేశ్వర వేద పరిరక్షణ ట్రస్ట్‌కు రూ. 10 లక్షలను విరాళంగా అందించారు. శనివారం తిరుమలలోని క్యాంపు కార్యాలయంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు విరాళం చెక్కును అందజేశారు.

## గోకులం షెడ్డును ప్రారంభించిన ....
## ఎమ్మెల్యే డాక్టర్ వి ఎం థామస్



వెదురుకుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, జనవరి 11: చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు నియోజకవర్గం వెదురుకుప్పం మండలంలోని చవనపల్లెలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా గోకులం షెడ్డును ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే డాక్టర్ వి ఎం థామస్ టిడిపి నాయకులు కార్యకర్తలు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## కోటపల్లి లో ఘనంగా శ్రీవెంకటేశ్వర స్వామి....
## గరుడ సేవ ఉత్సవాలు.



పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జనవరి 11: అన్నమయ్య జిల్లా పీలేరు పట్టణ శివారు కోటపల్లిలో గత రెండు రోజులుగా ఘనంగా శ్రీవెంకటేశ్వరస్వామి ఉత్సవాలు జరిగినట్లు ఆలయ చైర్మన్ శ్రీనాథ్ రెడ్డి,ఆలయ మెంబ ర్ హార్డ్ వేర్ షాపు నిర్వాహకులు రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిన్న శుక్రవారం వైకుంఠ ఏకాదశి కావడంతో శు క్రవారం, శనివారం కోటపల్లిలో పండగ వాతావరణం నెలకొంది. నేడు శనివారం శ్రీవెంకటేశ్వర స్వామి పల్లకిలో బాజా భజంత్రీలు,మేళ తాళాలతో కన్నుల పండుగగా గ్రామంలో గరుడ వాహనంపై విహరిస్తారని వారు తెలిపారు. భక్తాదులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించుకొని, మొక్కుబడులు తీర్చుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్ర మంలో భక్తులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని కార్యక్రమాన్ని తిలకించి పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు.

## ఘనంగా వడ్డెర ఓబన్న....
## జయంతి ఉత్సవాలు.
### వడ్డెర్ల ను ఎస్టి జాబితాలో చేర్చాలి.



పీలేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్,జనవరి 11: అన్నమయ్య జిల్లా పీలేరు వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలని వడ్డెర సంఘం నాయకులు పేర్కొన్నారు. పీలేరులోని మార్కెట్ ఆవరణలో వడ్డెర్ల ఓబన్న జయంతి సందర్భంగా వారు వడ్డెర వోబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికి పంచిపెట్టి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి కోటపల్లి బాబురెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మన తెలుగువాడు, స్వాతంత్ర సమరయోధుడు తెలుగు నేలపై బ్రిటిషర్లను ఎదిరించి పోరాడిన వడ్డే వోబన్న ఆశయాలు కొనసాగించాలని, ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వం వడ్డెర్ల ఓబన్న జయంతి ఉత్సవాలు అధికార లాంఛనాలతో జరపడం హర్షినియమని, వడ్డెర్ల లను ఎస్టి కులంలో చేర్చాలని ఏళ్ల తరబడి వారు పోరాటం చేస్తున్నారని ఆయన తెలిపారు. వడ్డే ఓబన్న అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు స్పోర్ట్స్ మల్లి,పోలిశెట్టి సురేంద్ర,షామియానా జయన్న, మహిళా నాయకులు రమాదేవి, పీలేరు మండల బీసీ అధ్యక్షులు అప్ప స్వామి,బండి సురేంద్ర,చిన్నప్ప, రేవూరి బాబు,చంద్రమ్మ, రమాదేవి,చలం పోట చంద్రస్వామి, చంద్రయ్య,ఆదినారాయణ,భాస్కర,క్రాంతి, రెడ్డప్ప,తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో మృతి చెందిన
## పలువురి కుటుంబాలకు ....
## పరామర్శించిన టిడిపి జాతీయ నేత నల్లారి.



పీలేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్, జనవరి 11: అన్నమయ్య జిల్లా పీలేరునియోజక వర్గం అనారోగ్యం తో మృతి చెందిన పలు కుటుంబ సభ్యులకు పరామ ర్శించిన తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు నియోజక వర్గ శాసన సభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి.గుట్టంకొండ మండలం నడిమి కంద్రిక మాజీ సర్పంచ్ రఘునాథ్ రెడ్డి మృతి బాధాకరమని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పీలేరు నియోజకవర్గ శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు గుట్టం కొండ మండల టిడిపి అధ్యక్షులు జగదీష్ ఎమ్మెల్యే కి సమాచారం ఇవ్వడంతో స్పందించిన కిషోర్ కుమార్ రెడ్డి వారి స్వగ్రామం చేరుకుని పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యుల్ని ప్రగాఢ సానుభూతి తెలుపుతూ పరామర్శిం చారు. అదేవిధంగా మొటుకు పల్లికి చెందిన చంటమ్మ, కలికిరి మండలం మహాలు చెందిన స్వామి కలకడ ఆంధ్రజ్యోతి విలేకరి రవి మాతృ మూర్తి కు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మీకు మీ కుటుంబ సభ్యులకు అందరికి అండగా ఉంటానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి కార్యకర్తలు నల్లారి అభిమానులు పాల్గొన్నారు.

## పారిశ్రామికరణతోనే ఉపాధి వందలాది కుటుంబాలకు......
# రక్షణ కల్పిస్తున్న పరిశ్రమలపై ఆక్రోశం




కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, జనవరి 11: చిత్తూరు జిల్లాకు మారుమూల ప్రాంతం కుప్పం. అటు కర్ణాటక, మరోవైపు తమిళ్ నాడు రాష్ట్రాల సంఘమంగా ఉన్న కుప్పం మరింత అభివృద్ధి సాధించాలంటే పారిశ్రామికరణ ఎంతో అవసరం. ఒక పరిశ్రమ నెలకొల్పాలంటే భూమి ఒక్కటే సరిపోదు. పరిశ్రమ నెలకొల్పడానికి మిషనరీ, నీరు, పర్యావరణ సమతుల్యత పాటిస్తూ అటవీ శాఖ నుంచి అనుమతులు, రెవెన్యూ శాఖ నుంచి ఎన్ఓసీలు ఇలా ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని పరిశ్రమను స్థాపించాల్సి ఉంటుంది. పరిశ్రమలు ఏర్పాటు చేసే పారిశ్రామికవేత్తలు పరిశ్రమపై వెచ్చించిన నగదు కన్నా కార్మికుల శ్రమకు అధికంగా చెల్లించాల్సిన పరిస్థితి వస్తోంది. ఇదే సందర్భంలో కార్మికుల కష్టంతో పరిశ్రమ నడుస్తుంది అనేది ఎంతో సత్యం. అయితే కుప్పంలో ఏర్పాటు చేసిన జై గ్రానైట్స్, గ్రేస్ బ్లూ మెటల్స్ తదితర గ్రానైట్ కంపెనీ వందలాది కుటుంబాలు పనులు చేస్తూ కుటుంబాలు పోషించుకుంటున్నారు. కార్మికుల సంక్షేమ కోసం కంపెనీలు నిరంతరం సహాయ సహకారాలు అందిస్తున్నాయి. అయితే ఇటీవల కుప్పం ప్రాంతాల్లో నెలకొల్పిన పారిశ్రామికవేత్తలకు రాజకీయ ఒత్తిడితోపాటు, కార్మిక సంఘాల నేతల ఒత్తిడి కూడా పెరిగిందని పారిశ్రామికవేత్తలు ఆవేద చెందుతున్నారు. జిల్లాల ఒక మారుమూల ప్రాంతంలో పరిశ్రమ నెలకొల్పి ఎందరికో ఉపాధి కల్పిస్తున్న తమకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఒత్తిడి లేకపోయినప్పటికీ ఇతర ఒత్తిళ్లతో సతమతమవుతున్నట్టు కొందరు ది పీపుల్ పవర్ ప్రతినిధి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,దినపత్రిక ప్రతినిధికి వివరించి వాపోయారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలో పరిశ్రమలకు ప్రోత్సాహం కల్పించడంతోపాటు ఇతర ఒత్తిడిల నుంచి ఆదుకొని సవ్యంగా పరిశ్రమ నడిచేందుకు సహకరించాలని గ్రానైట్ కంపెనీల యజమానులు కోరారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు భరోసా...
### – ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్

కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, జనవరి 11: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు భరోసా కల్పిస్తుందని తెలుగుదేశం పార్టీ కుప్పం నియోజకవర్గ సమన్వయ కమిటీ చైర్మన్, ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. శనివారం స్థానిక మండల కార్యాలయంలోని సమావేశ మందిరంలో బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ , ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పి.ఎస్ మునిరత్నం, టిడిపి ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సురేష్ బాబు అందజేశారు. కుప్పం నియోజకవర్గం లోని నాలుగు మండలాలతో పాటు కుప్పం మునిసిపాలిటీ పరిధిలోని 145 మందికి రూ. 2.93 కోట్లు ముఖ్యమంత్రి సహాయ నధి చెక్కులను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా కుప్పం నియోజకవర్గ పేద ప్రజలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సీఎంఆర్ఎఫ్ అందజేయడం గొప్ప విషయం అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 7 నెలల్లో సుమారు రూ. 5 కోట్ల పైచిలుకు కుప్పం ప్రజలకు సీఎంఆర్ఎఫ్ అందజేసినట్లు వివరించారు. కుప్పం ప్రజలకు తెలుగుదేశం పార్టీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అండగా ఉంటారన్నారు. కుప్పం నియోజకవర్గ ప్రజల సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి సహాయ నిధి పార్టీలకు అతీతంగా అందించమన్నారు. కార్యక్ర మంలో ఆర్డీవో శ్రీనివాసరాజు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు రాజ్ కుమార్, గోపీనాథ్, వేలు , సత్యం రాజశేఖర్, ప్రేమ్ కుమార్, ఆనంద్ రెడ్డి, విశ్వనాథ నాయుడు, తిరుమగళ్, కుప్పం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# గోకులం షెడ్ పాడిరైతులకు ఎంతో ఉపయోగకరం
### : ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి





శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జనవరి 11: తొట్టంబేడు లోని చిన్న సింగమాల గ్రామం నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతుల కోసం ప్రవేశపెట్టిన మినీ గోకులం షెడ్ ను శనివారం శ్రీకాళహస్తి శాసన సభ్య లు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ప్రారంభిం చారు. ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి కి టిడిపి మండల అధ్యక్షులు గాలి మురళి నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి నారాలోకేష్ పాడి రైతులు సమస్యలను దృష్టిలో పెట్టుకుని వారిని ఎలా అయినా ఆదుకోవాలని ఒక ఉద్దేశంతో మినీ గోకులం షెడ్డు పథకం తీసుకొచ్చారని తెలిపారు. ఈ పథకం ద్వారా పాడి రైతుకు ఎంతో ఉపయోగ కరమన్నారు. అనంతరం అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించి మెరుగైన వసతులు కల్పించాలని అధికారులు ఆదేశించారు. ఆ గ్రామ యువత విద్యార్థులు కోరిక మేరకు ఆట స్థలాన్ని బాగుపరచాలని కోరగా వెంటనే బాగు చేసి కాంపౌండ్ నిర్మించాలని ఎంపీడీవో సురేంద్రనాథ్ కి సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు, టిడిపి మండల అధ్యక్షులు గాలి మురళి నాయుడు, ఉన్నం ప్రసాద్ నాయుడు, ఎంపీడీవో సురేంద్ర నాథ్, ఏపీవో సుజాత, పంచాయతీ సర్పంచ్ మాధవి, మాజీ ఎంపీటీసీ విజయ్ కుమార్ నాయుడు, గోవర్ధన్ నాయుడు, గుర్రప్ప,మండల నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా గురువారెడ్డి
## వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తా..

ఎస్ఆర్ పురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, జనవరి 11: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షు డిగా గురువారెడ్డిని నియమించినట్లు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కరుణాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు ఎస్ఆర్ పురం మండలం పిల్లారి కుప్పం గ్రామానికి చెందిన గురువారెడ్డి ఎస్ ఆర్ పురం మండల మాజీ జడ్పిటిసిగా పనిచే శారు. అలాగే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేశారు. ఆయన సేవలను గుర్తించి చిత్తూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా నియమించడం జరిగింది నాకు ఈ పదవి రావడానికి కృషి చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాజీ ముఖ్య మంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కి మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామికి ఎంపీ మిధున్ రెడ్డికి,విజయానంద రెడ్డికి, జీడి నెల్లూరు వైఎస్ఆర్ పార్టీ ఇంచార్జ్ కృపా లక్ష్మికి కృతజ్ఞతలు తెలియజేశారు అలాగే గంగాధర్ నెల్లూరు నియోజకవర్గంలో వైయస్సార్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధైర్య పడకండి... మీకు అండగా నేను న్నాను మనకు పార్టీ అండగా ఉంటుందని కార్యకర్తలకు నాయకులు జిల్లా ఉపాధ్య క్షుడు గురువారెడ్డి భరోసా ఇచ్చారు.



అనం తరం ఎస్ఆర్ పురం మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు జిల్లా ఉపాధ్యక్షుడు గురువారెడ్డిని ఘనంగా సన్మానించి సత్కరించారు ఈ కార్యక్రమం లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువ నాయ కుడు గోపిచలం,అశోక్ రెడ్డి,సర్పంచ్ సంఘ అధ్యక్షుడు దిలీప్ రెడ్డి,కటిక పల్లి సర్పంచ్ మార్కొండయ్య, మండల అధ్యక్షుడు మనీ ,వైయస్సార్ పార్టీ నాయకులు జనార్ధన్, బాబు మహేష్, మనీ, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

# రవీంద్రబాబుకు ఎమ్మెల్యే బొజ్జల పరామర్శ



శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్, జనవరి 11: శ్రీకాళహస్తి పురపాలక సంఘం మాజీ కౌన్సిలరు టిడిపినాయకులు రవీంద్ర బాబును శనివారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి పరామర్శిం చారు. రవీంద్రబాబు సతీమణి శ్రీదేవి ఇటీవల గుండెపోటుతో తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించి ధైర్యం చెప్పారు. శ్రీదేవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి కోరుకున్నారు. కర్మ క్రియలకు తాను హాజరవుతానని రవీంద్రబాబు కుటుంబ సభ్యులకు తెలియజేశారు. శాసనసభ్యులు వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు, టిడిపి పట్టణ అధ్యక్షులు విజయ్ కుమార్ నాయుడు, టిడిపి సీనియర్ నాయకులు ధనుంజయలు నాయుడు, శ్రీకాళహస్తి పాల సొసైటీ మాజీ చైర్మన్ మునిరాజు నాయుడు, శ్రీకాళహస్తి జడ్పిటిసి కాపిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, లక్కమనేని మధుబాబు, శోభన్ నాయుడు, బాలాజీ రెడ్డి ,ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మల్లికార్జున స్వామి కి....
## అభిషేక పూజలు




కల్లూరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్,జనవరి 11: పులిచెర్ల మండలం పరిధిలోని చిచ్చిలి వారి పల్లి వెలసిన శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో స్వామివారికి విశేష పూజలు అభిషేక నిర్వహించారు. ఆలయంలో ఉదయం స్వామివారికి అర్చనలు, పూజలు జరిపి ప్రత్యేకంగా అలంకరించి నైవేద్యం సమర్పించి మహా మంగళహారతి గావించారు. ఆలయ ప్రధాన అర్చకులు రాజశేఖర్ దీక్షితులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉభయ దారులుగా ముప్పి రెడ్డి గారి పల్లె వాస్తవ్యులు కుమార్ నాథ్ రెడ్డి కుటుంబ సభ్యులు వ్యవహరిం చారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

## సంక్రాంతి సందర్భంగా ....
## వీరాంజనేయ స్వామికి పొంగులు



వీ.కోట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జనవరి 11: చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం వీకోట మండలం కుంభార్లపల్లి పంచాయ తీకి చెందిన గెస్తంపల్లి గ్రామంలో సంక్రాంతి ఉత్సవాలలో భాగంగా ద్వాపర యుగము లో పాండవుల చేత నిర్మితమైన, నాయక నేరీ ప్రధాన రహదారి ప్రక్కన హనుమంతు నగర్ సమీపంలో గల శ్రీవీరాంజనేయ స్వామి ఆలయమునకు,గెస్తంపల్లి గ్రామస్తుల చేత పొంగళ్ళు తీసుకువెళ్లి స్వామివారికి అభిషేకం, పువ్వుల అలంకరణతో స్వామివారిని భారీగా అలంకరణ చేసి అనంతరం పొంగులను చెల్లించి పూజలు చేసినారు. ఈ కార్యక్ర మాన్ని గెస్తంపల్లి గ్రామ పెద్ద ఎంసి సురేంద్ర గౌడ ఆధ్వర్యంలో గ్రామస్తుల సహకారంతో అతి వైభవంగా నిర్వహించారు.

## జిల్లా వైసీపీ జనరల్ సెక్రటరీగా.....
## మురవత్ భాష



కల్లూరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్,జనవరి 11: పులిచెర్ల మండలం మంగళంపేటకు చెందిన మైనార్టీ నాయకులు షేక్ మురవత్ భాషా నం జిల్లా వైసీపీ జనరల్ సెక్రటరీగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో వైసిపి విజయానికి కృషి చేస్తానన్నారు. తమ నియామకాన్ని సహకరించిన మాజీమంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి, రాజంపేట ఎంపీ వెంకటమిదిన్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పటిష్టం చేస్తూ రాబోయే ఎన్నికల్లో వైయస్ జగన్మోహన్ రెడ్డి మరోసారి గెలిపించే దిశగా పోరాడతానని అన్నారు.

## కుప్పం డిగ్రీకళాశాలలో ....
## అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు



కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జనవరి 11: కుప్పం డిగ్రీ కళాశాల ప్రాంగణం అందమైన రంగు వల్లులతో సాంప్రదాయ వస్త్రదారణ లో వున్న విద్యార్థిని, కళాశాల సిబ్బందితో సంక్రాంతి ముందే వచ్చిందా అన్నట్లు కళక ళలాడింది. ఈ సంబరాలకు బిసి ఎన్ విద్యాసంస్థల అధినేత బిసి నాగరాజ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. భోగి, సంక్రాంతి, కనుమలలో ముఖ్య ఘట్టాలైన భోగి మంటలు, చిన్నారులకు భోగి పళ్ళు పోయడం పొంగలి చేయటం, పశు వులను పూజించటం వంట సాంప్రదాయ ప్రజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ శాంతానాగరాజ్ మాట్లడుతూ మనదేశ సాంస్కృతి సాంప్రదాయలను గౌరవిస్తూ ప్రతి ఒక్కరు పాటించాలని పిలుపునిచ్చా రు. కళాశాల ప్రాంగణంలో ముగ్గుల పోటీల ను నిర్వహించి గెలుపొందిన వారికి బహు మతులు అందజేశారు. అదే విధంగా సాంస్కృతిక కార్యక్రమాలు,ఉట్టి కొట్టడం వంటివి నిర్వహించారు. ఈ సంక్రాంతి సంబరాలను నిర్వహించిన వాణిజ్య విభాగ అధ్యాపకులను విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ .సుధారాణి అభినందించారు.

## ఐదు జిల్లాల్లో కరువు పరిస్థితులు

కర్నూలు : ఆంధ్రప్రదేశ్‌లో గత ఏడాది నెలకొన్న ఖరీఫ్ కరువు పరిస్థితులను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసిన కేంద్ర నుంచి సాయం అందించే విషయంలో ఉదారంగా స్పందించాలని ఏపీ రెవెన్యూ శాఖ స్పెషల్ సీఎస్, ఆర్పీ సిసోడియా కోరారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులను రెవిన్యూ కార్యదర్శి సిసోడియా కేంద్ర బృందానికి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఐదు జిల్లాల్లోని 54 మండలాల్లో గత ఏడాది కరువు పరిస్థితులు ఉన్నాయని చెప్పారు. అన్నమయ్య జిల్లాలో – 19మండలాలు, చిత్తూరులో – 16 మండలాలు, శ్రీ సత్య సాయిలో – 10 మండలాలు, అనంతపురంలో – 7 మండలాలు, కర్నూలులో – 2 మండలాలను ఇప్పటికే ఇప్పటికే కరువు మండలాలు ప్రకటించారు. వాటిలో 27 తీవ్ర కరువు మండలాలు, 27 మధ్యస్థ కరువు మండలాలుగా సిసోడియా పేర్కొన్నారు. కేంద్ర కరువు మాన్యువల్ ప్రకారం సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షపాతం, వర్షాభావంతో అత్యధిక డ్రైస్పెల్స్, రిమోట్ సెన్సింగ్, సాయిల్ మోయిశ్చర్, హైడ్రాలజీ, పంట నష్టం 33% అంతకంటే ఎక్కువ ఉన్న మండలాలను పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వం కరువు ప్రాంతాలను ప్రకటించిందని వివరించారు.

## పాడి రైతులకు వరం గోకుల షెడ్లు..

### ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే డాక్టర్ థామస్



ఎస్ఆర్ పురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, జనవరి 11: పాడి రైతులకు వరం గోకుల షెడ్లు అని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అన్నారు శనివారం జీడి నెల్లూరు మండలం పాతపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన గోకులం షెడ్లను ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ప్రారంభించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ థామస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం లో ప్రతి మండలంలోనూ టిడిపి కార్యకర్తలకు కూటమి పార్టీ నాయకులకు అందరికీ గోకులం షెడ్లు మంజూరు చేయడం జరిగింది ఈ గోకులం షెడ్లు నిర్మించడం వల్ల పశు సంరక్షణకు ఈ షెడ్లు ఎంతో ఉపయోగపడుతుంది ఎండకు వానకు అన్నిటికీ పశువులు సురక్షితంగా ఉంటుంది ప్రతి పాడి రైతుకు ఈ గోకులం షెడ్డు ఎంతో ఉపయోగమని పాడి రైతులకు గోకులం షెడ్డు ఒక వరమని తెలిపారు ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు స్వామి దాస్ యాదవ సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్ టిడిపి జిల్లా నాయకులు కృష్ణం నాయుడు మాజీ జడ్పిటిసి వెంకటేష్ నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుండయ్య ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి చంద్రశేఖర్ దాము అనిల్ లోకేష్ ఎస్ఆర్ పురం మండల మాజీ సర్పంచ్ కుప్పయ్య బీగాల రమేష్ టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆత్రేయపురంలో బోట్ ఫైట్

కాకినాడ : పొగ మంచుల్లో.. భోగి మంటల్లో.. చుట్టాల పిలుపుల్లో.. మనసారా మాటల్ని కలిపేస్తూ.. అందరినీ ఒక్కటి చేసేదే సంక్రాంతి. ప్రేమానురాగాలతో, ఆప్యాయతలతో గడిపే సంతోష సమయమిది. పండక్కి నవ్వులతో స్వాగతం పలికే ఊళ్లు.. హృదయాల్ని కదిలించే పలకరింపులు, తెలుగు సంప్రదాయాన్ని, తెలుగు వాళ్లందరినీ ఏకం చేసే గొప్ప సంస్కృతి సంక్రాంతి. అందుకోసమే.. ఎక్కడున్నా పండక్కి మనసు ఊరు మీదకు లాగుతుంది. ల్యాగ్ లేకుండా బ్యాగు సర్దుకొని పల్లెకు వెళ్లిపోయేలా చేస్తుంది.ఈ సంక్రాంతి పండుగలో.. కుటుంబ సభ్యులు, స్నేహితులతో సరదాగా గడపడమే కాదు.. కిక్కిచ్చే ఎలిమెంట్స్ ఇంకా చాలానే ఉన్నాయ్. కోళ్ల పందాల్లో.. పందెం పుంజులు చూపే పౌరుషాలు.. తిరునాళ్లు, సంబరాలు.. ఇలా చాలానే ఉంటాయి. ఇవన్నీ.. ఏడాది పాటు మనం పడే కష్టాన్ని మర్చిపోయేలా చేస్తాయి. కొన్ని నెలలకు కావాల్సినన్ని మధుర స్మృతుల్ని మిగులుస్తాయి. 3 రోజులు.. ఆనందోత్సాహాలతో చేసుకునే సంక్రాంతి పండుగ.. ప్రకృతి సౌందర్యాన్ని ఆవిష్కరిస్తుంది. మన తెలుగింటి బంధాల్ని బలపరుస్తుంది. సంక్రాంతి.. మన సంస్కృతీ సంప్రదాయాలకు నిలువుటద్దం. ఆత్మీయతలూ, అనురాగాలకు నిలువెత్తు నిదర్శనం. మొత్తంగా.. సంక్రాంతి పండుగంటే పల్లెలదే.. నూతన సంవత్సరంలో పెద్ద పండుగని.. ఆస్వాదించాలంటే.. అమ్మలాంటి పల్లెకు పోవాల్సిందేఆంధ్రాలో ఇప్పటికే సంక్రాంతి సందడి మొదలైంది. ఆత్రేయపురం అంటే పూతరేకులే గుర్తొస్తాయి. బట్ ఫర్ ఏ ఛేంజ్.. ఈ సంక్రాంతి నుంచి.. కేరళ మాదిరి పడవ పోటీలు కూడా గుర్తొస్తాయి. కోనసీమలో లక్షల ఎకరాలకు నీరందించే ప్రధాన కాలువలో నిర్వహించబోయే పడవ పందాలు.. ఈసారి స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలవబోతున్నాయి. కోనసీమ తిరుమలగా పిలవబడే.. వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో.. ఈ పడవ పోటీలు జరగబోతున్నాయి. ఇకపై.. ప్రతి సంక్రాంతికి కోడి పందాలతో పాటు పడవ పందాలు కూడా నిర్వహిస్తామంటున్నారు నిర్వాహకులు.ఆత్రేయపురంలో జరగబోయే పడవ పోటీలకు.. రాష్ట్రం నలుమూలల నుంచి స్విమ్మర్స్, బోర్డర్స్ వస్తున్నారు. మొత్తం.. ఐదు విభాగాల్లో ఈ పడవ పోటీలు నిర్వహించనున్నారు. సుమారుగా.. ఫోర్ మెన్ డ్రాగన్ బోటింగ్ పోటీల్లో 150 మంది వరకు పాల్గొననున్నారు. అలాగే.. డ్రాగన్ బోట్, కెనోస్ లాలం, కెనోస్ స్ప్రింట్, కెనో పోలో, దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా కెనో పారా బోట్స్ విభాగాల్లో.. పడవ పోటీలు జరగనున్నాయి. కృష్ణా జిల్లాలోని మారుమూల పల్లెటూరులోని.. మత్స్యకార కుటుంబం నుంచి వచ్చిన గాయత్రి.. భారత్ తరపున కెనోస్ లాలం విభాగంలో పోటీ పడి.. ఏడు మెడల్స్ సాధించింది. ఇంతటి ప్రతిభ కలిగిన గాయత్రి.. ఈసారి ఆత్రేయపురం పడవ పోటీల్లో పాల్గొనబోతోంది. పందెం ఎక్కడైనా.. ప్రాక్టీస్ ఒకేలా ఉంటుందని గాయత్రి చెబుతోంది. ఆ అమ్మాయి చేస్తున్న విన్యాసాలు.. అందరినీ కట్టిపడేస్తున్నాయ్.ఇటీవల జరిగిన నేషనల్ ఫోర్ మెన్ డ్రాగన్ బోట్ పందాల్లో.. ఆంధ్రాకు కాంస్య పతకం సాధించిన గిరిబాబు, భాస్కర్ కూడా ఆత్రేయపురం పడవ పోటీల్లో పాల్గొననున్నారు. సాధారణ స్విమ్మర్లుగా ఉండే తమను.. బోట్స్‌మెన్‌గా మార్చిన కోచ్ శివారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు చెబుతున్నారు. కొండల మధ్య నుంచి వచ్చే వాటర్ ఫోర్స్ మధ్యలో చేసే కేనోసాలం బోటింగ్ ప్రాక్టీస్‌కి అనువైన ప్రదేశం.. ఆత్రేయపురం లొల్లలాకుల దగ్గర ఉందంటున్నారు. పోటీలు ముగిసిన తర్వాత.. 15 రోజుల పాటు క్యాంపును ఏర్పాటు చేస్తున్నట్లు కోచ్ శివారెడ్డి తెలిపారు.

## నేషనల్ హైవేలు, రాష్ట్ర రహదారులపై ఫోకస్

కడప : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నేషనల్ హైవేలు, రాష్ట్ర రహదారులపై ఫోకస్ పెట్టింది. కొత్త ప్రాజెక్టులతో పాటుగా గతంలో అనుమతులు వచ్చిన వాటి పనుల్ని వేగవంతం చేస్తోంది. ఆంధ్రప్రదేశ్ కర్ణాటక రాష్ట్రాలకు సంబంధించి కీలకమైన బెంగళూరు-కడప-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే పనులు స్పీడ్ అందుకున్నాయి. ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే పనుల్ని 2026నాటికి పూర్తి చేయాలని టార్గెట్ పెట్టుకున్నారు.. ఈ మేరకు పనులు కొనసాగుతున్నాయి. ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేతో అమరావతి నుంచి బెంగళూరుకు కనెక్టివిటీ ఉంటుంది. విజయవాడ నుంచి వెళ్లాలంటే గుంటూరు, నరసరావుపేట, వినుకొండ, మార్కాపురం, కడప మీదుగా వెళ్లొచ్చు. అలాగే గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి మీదుగా బెంగళూరుకు వెళ్లొచ్చు.కేంద్రం నేషనల్ హైవేల నిర్మాణంలో భాగంగా బెంగళూరు-కడప-విజయవాడకు కొత్తగా హైవే కనెక్టివిటీ ఉండాలని భావించింది. అందుకే రెండేళ్ల క్రితం ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేకు రూ.1930 కోట్ల అంచనాతో గ్రీన్ సిగ్నల్ రావడంతో పనులు ప్రారంభమయ్యాయి. ఈ హైవేకు సంబంధించి.. విజయవాడ నుంచి బాపట్ల జిల్లా జే.పంగులూరు మండలం ముప్పవరం వరకు 113 కి.మీ జాతీయ రహదారులతో ఈ గ్రీన్ ఫీల్డ్ వేను కనెక్ట్ చేయనున్నారు. అలాగే బెంగళూరు నుంచి ఉమ్మడి అనంతపురం జిల్లా కొడికొండ వరకు ఉన్న 73 కి.మీ కూడా జాతీయ రహదారులతో అనుసంధానం చేస్తారు. మొత్తం 529 కిలో మీటర్ల దూరం మార్గంలో ఇప్పటికే రెండు వైపులా ఉన్న రెండు నేషనల్ హైవేల 186 కి.మీ. మినహా మరో 343 కిలోమీటర్ల పనులు చేపట్టాల్సి ఉంది.బెంగళూరు-కడప-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేను 14 భాగాలుగా చేశారు. బాపట్ల జిల్లా జే.పంగులూరు మండలం ముప్పవరం నుంచి తాళ్లూరు మండలం తూర్పు గంగవరం వరకు నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి.

## వి కోటలో వైభవంగా వడ్డే ఓబన్న జయంతి ఉత్సవాలు.

వీ.కోట,చిత్తూరు ఎక్స్ ప్రెస్,జనవరి 11: చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం వీకోట మండలం.శనివారం రోజున వి.కోట అంబేద్కర్ సర్కిల్ ,వైస్సార్ సర్కిల్ నందు స్వాతంత్ర సమరయోధుడు,రేనాటి వీరుడు,బ్రిటిష్ వారి గుండెల్లో వణుకు పుట్టించిన వీరుడు, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ప్రధాన అనుచరుడు,వడ్డెర జాతి ముద్దుబిడ్డ వడ్డే ఓభన్న 218 జయంతి వేడుకలను వి.కోట మండలం వడ్డెర కులస్తుల ఆధ్వర్యంలో అతి వైభవం గా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వడ్డే ఓభన్న భారీ చిత్రపటానికి పూలమాలవేసి పూజా కార్యక్రమం నిర్వహించి,కేక్ కట్ చేపట్టి ప్రజలకు పంచిపెట్టారు. స్వాతంత్ర సంగ్రామంలో ఆయన చేసిన కృషిని, త్యాగాన్ని స్మరించుకుంటూ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమం లో



భాగంగా చిత్తూరు జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు,పలమనేరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రామచంద్ర నాయుడు,వడ్డెర నాయకులు యం.డి.హెచ్.పవన్ కళ్యాణ్, రాము,సుబ్బన్న,పునీత్,గోవిందస్వామి,బాలు,చలపతి ,రామకృష్ణ, మండలంలోని వడ్డెర కులస్తులు భారీ సంఖ్యలు చేరుకొని వడ్డే ఓబన్నకు 218వ జయంతి శుభాకాంక్షలు తెలియజేసినారు.

### అంగరంగ వైభవంగా .....

## టిడిపి జిల్లా అధ్యక్షుడు సిఆర్ రాజన్ జన్మదిన వేడుకలు

ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జనవరి11: తెలుగుదేశం పార్టీ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ సి ఆర్ రాజన్ జన్మదిన వేడుకలు శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు చిత్తూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎస్ఆర్ పురం మండలం చెందిన టిడిపి యువ నాయకుడు ఐటీ వింగ్ టీమ్ లీడర్ సాఫ్ట్వేర్ బాలు ఆధ్వ ర్యంలో సుమారు 10 కేజీల కేక్ ను జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం కి తీసుకెళ్లి జిల్లా టిడిపి అధ్యక్షుడు సిఆర్ రాజన్ సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అలాగే గంగాధర్ నెల్లూరు మండలం తానా నుంచి తెలుగుదేశం పార్టీ కార్యాలయం వరకు సాఫ్ట్వేర్ బాలు ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు సిఆర్ రాజన్ భారీ కటౌట్లు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు ఎస్ఆర్ పురం నుంచి టిడిపి నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో వెళ్లి సి ఆర్ రాజన్ కు గజమాల తో సన్మానించి సత్కరించి జన్మదిన శుభాకాం క్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ జయచంద్ర నాయుడు వన్నె కుల రాష్ట్ర నాయకులు విజయకుమార్ టిడిపి రాష్ట్ర



నాయకులు కొల్లు సుబ్బు, పెద్దతయ్యూరు టిడిపి యువ నాయకుడు రాజు గల్లా, కొత్తపల్లి టిడిపి యువ నాయకుడు సతీష్ జీవన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సీలింగ్ విధిస్తారా..? లేదా..?

ఖమ్మం, : తెలంగాణలో రైతు భరోసా స్కీమ్ పట్టాలెక్కనుంది. ఈ మేరకు తెలంగాణ సర్కార్ ఇటీవలనే కీలక నిర్ణయాలు కూడా తీసుకుంది. స్కీమ్ అమలుకు సంబంధించి మంత్రివర్గం కూడా ఆమోదముద్ర వేసింది. జనవరి 26వ తేదీ నుంచి ఈ స్కీమ్ ను అమలు చేయాలని నిర్ణయించింది. ఏటా రూ. 12 వేల పంట పెట్టుబడి సాయం అందించబోతుంది.రైతు భరోసా స్కీమ్ ను అమలు చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్న సంగతి తెలిసిందే. అయితే పథకం అమలులో సర్కార్ ఎలాంటి చర్యలు తీసుకోబోతుందనేది ఆసక్తికరంగా మారింది. గతంలో ఉన్న రైతుబంధు పథకం అమలులో అనేక లోపాలు ఉన్నాయని.. ప్రభుత్వ నిధుల దుర్వినియోగం జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతూ వస్తోంది. గతంలో మాదిరిగా స్కీమ్ అమలు ఉండదని? సాగు యోగ్యత ఉన్న భూములకే రైతు భరోసా ఇస్తామని కూడా క్లారిటీ ఇచ్చింది.స్కీమ్ అమలుపై ప్రాథమికంగా కొన్ని సందేహాలు తెరపైకి వస్తున్నాయి. ఇందులో సీలింగ్ అంశం కూడా ఒకటిగా ఉంది. గతంలో అమలు చేసిన రైతుబంధు పథకం కింద ఒక రైతుకు ఎన్ని ఎకరాలు ఉన్నా.. పంట పెట్టుబడి సాయం అందించారు. ఎలాంటి సీలింగ్ ను కూడా నిర్ణయించలేదు. దీంతో రైతుకు ఎంత విస్తీర్ణంలో భూమి ఉందో.. అంతమేరకు పంట సాయం అందింది. అయితే దీనిపై అనేక వర్గాల నుంచి పలు అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ప్రస్తుతం అమలు చేయబోతే రైతు భరోసా పథకంలో సీలింగ్ ఉంటుందా..? ఉండదా..? అనే విషయంలో స్పష్టత రావాల్సి ఉంది. నిజానికి కేబినెట్ సబ్ కమిటీ.. జిల్లా వారీగా రైతుల నుంచి అభిప్రాయాలను కూడా సేకరించింది. అసెంబ్లీలో నిర్వహించిన చర్చలో కూడా పలు సూచనలు, సలహాలు వచ్చాయి. దీనిపై కేబినెట్ భేటీలో కూడా చర్చ జరిగింది. అయితే ఈ విషయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనట్లు తెలిసింది.కేబినెట్ భేటీ ముగిసిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయాలను వెల్లడించారు. సాగు యోగ్యత ఉన్న భూములకు ఎలాంటి షరతు లేకుండా పంట పెట్టుబడి సాయం అందిస్తామని స్పష్టంగా చెప్పారు. అంటే? సీలింగ్ లేకుండానే ఈ స్కీమ్ ను అమలు చేస్తారా..? అన్న చర్చ కూడా తెరపైకి వస్తోంది.ఇక తాజాగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కీలక వ్యాఖ్యలు చేశారు. గురువారం వనపర్తి జిల్లాలో పర్యటించిన ఆయన? రైతు భరోసా పథకం గురించి మాట్లాడారు. జనవరి 26 నుంచి అన్నదాతల అకౌంట్లలో ఎకరానికి 12 వేల రూపాయల డబ్బులను జమ చేస్తామని చెప్పారు. సాగు చేసే ప్రతీ ఎకరానికి రైతు భరోసా ఇస్తామంటూ క్లారిటీ ఇచ్చారు. “ఐదు ఎకరాలో, పది ఎకరాలో కాదు ఎలాంటి షరతులు లేకుండా వ్యవసాయ యోగ్యమైన భూములన్నింటికి కూడా రైతు భరోసా అందుతుంది. జనవరి 26 నుంచి స్కీమ్ అమలు చేయబోతున్నాం.






OWNER AND PUBLISHED BY DAMA VIJAYAKUMAR, PRINTED AT VIJAY PUBLISHERS AND PRINTERS
D.No. 1-176, ANJUR Village & Post, K.V.B.PURAM Mandal, PIN:517643, Thirupati District A.P. Mobile: 9440352036